క్లుప్తంగా

వీరేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్



వీరేశ్వరుని సన్నిధిలో కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఐ.పోలవరం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సోమవారం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తిలు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కలెక్టర్ వెంట సర్పంచ్ కాశీ రాజుబాబు తదితరులున్నారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం



అయ్యప్పస్వామికి అన్నాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అమలాపురం రూరల్: స్థానిక బైపాస్ రోడ్డులోని కోనసీమ మహాశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామికి అన్నాభిషేకం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కొమానపల్లి నటరాజ స్వామి ఆధ్వర్యంలో దాదాపు 20 కిలోల అన్నాన్ని స్వామికి అభిషేకించారు. పట్టణానికి చెందిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస రావు దంపతులు కర్తలుగా వ్యవహరించారు.

రాష్ట్ర సమావేశాన్ని విజయవంతం చేయండి

ఐ.పోలవరం: ఈ నెల 6న విజయవాడలో జరగనున్న ఆర్‌డబ్ల్యూఎస్, సీపీడబ్ల్యూఎస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాష్ట్ర సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది హాజరవ్వాలని కోరారు. సమావేశంలో జి.రమేష్‌బాబు, యూవీ కిషోర్, ఎన్.రాజశేఖర్, ఆర్.శ్రీనివాసరావు, ఎం.వీరయ్య, వి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు



అమలాపురంలో గంధంతో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్: పట్టణంలోని ముస్లిం వీధిలో ఉన్న హజరత్ ఖ్వాజా బాబా దర్గా వద్ద ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. దర్గా నుంచి పుర వీధుల్లో ఊరేగింపు సాగింది. గంధం తీసుకుని గుర్రంపై ఫకీరు వాయిద్యాలతో ముస్లిం వీధి, హైస్కూలు సెంటరు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు మీదుగా తిరిగి దర్గాకు చేరుకుంది. అనంతరం దర్గాలోని బాబా వారి సమాధిపై గంధం పూసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో హిందూ ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మహమ్మద్ ఆజామ్, మహ్మద్ అమీర్, వలి, బాషాజాన్, ఎండీ బషీర్, సాజిద్ హజరీ తదితరులు పాల్గొన్నారు.

భీమా కోరేగావ్ విజయోత్సవ వేడుకలు



కోరేగావ్ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస్ తదితరులు

ముమ్మిడివరం: భీమా కోరేగావ్ విజయోత్సవ వేడుకలను స్థానిక బుద్ధ పార్కులో చీకురుమిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 1818లో భీమా నది ఒడ్డున జరిగిన యుద్ధంలో మహవీర్ సైనికుల విజయానికి గుర్తుగా విజయోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పెనుమాల సుధీర్, నాతి జగన్నాథం, మట్టా సిద్ధార్థగౌతమ్, వీవీ సత్యనారాయణ, దోనిపాటి ఆంజనేయులు, సకిలే పృథ్వీరాజ్, బుడితి శరత్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు కేక్ తినిపిస్తున్న అభిమానులు



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



చల్లపల్లిలో ఎంపీపీ జానకి దంపతులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీవో గౌరీకుమారి



దివ్యాంగులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎంపీపీ సునీత, ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ



కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్

సందడిగా న్యూఇయర్ వేడుకలు

- ఉత్సాహంగా కొత్త ఏడాది సంబరం
- నేతల ఇళ్ల వద్ద అభిమానుల హడావుడి



ఎంపీ చింతా అనురాధకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నేతలు, అభిమానులు



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

అల్లవరం: కొత్త ఏడాదిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టిస్తుందని ఎంపీ చింతా అనురాధ అన్నారు. మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఆర్డీఓలు కేశవవర్ధనరెడ్డి, ముక్కంటి, డీఆర్‌ఓ సత్తిబాబు, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, పంచాయతీరాజ్ ఈఈ చింటిబాబులు ఎంపీ అనురాధకి పుష్పగుచ్ఛం అందించి కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీలు కొనుకు గౌతమి, ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఉప్పలగుప్తం జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, మామిడికుదురు జెడ్పీటీసీ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. గోడిలోని తన నివాసంలో జరిగిన వేడుకల్లో అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కట్ చేసి అందరికీ పంచారు.

యానాం: పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి 2024 కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కార్యాలయానికి అధికారులు, ఉద్యోగులు, అభిమానులు భారీగా తరలిరావడంతో ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ ఇన్‌చార్జి ఖండవల్లి రామకృష్ణ, యానం బీజేపీ శాఖ అధ్యక్షుడు కనకాల రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది దుర్గ తదితరులు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరులోని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషాలను, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌లను సీఐలు, ఎస్ఐలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో ఎంపీపీ నివాసానికి పలువురు అధికారులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు చేరుకుని దంగేటి వీర అచ్యుత జానకి, రాష్ట్ర కార్యదర్శి రాంబాబు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఇన్‌చార్జి ఎంపీడీఓ కేఎస్ గౌరీకుమారి, ఎంఈఓ సత్తి సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న సేవాసమితి ఆధ్వర్యంలో 200 మంది విభిన్న ప్రతిభావంతులకు ఎంపీపీ రాయుడు సునీత చేతుల మీదుగా ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఎంతోమందికి శివన్నారాయణ అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. జి.వేమవరం పంచాయతీ కాలనీలో పాస్టర్ కడియాల విజయ్‌కుమార్ నేతృత్వంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీతకు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. స్థానిక పరదేశమ్మ వీధిలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్‌లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

అమలాపురం రూరల్: కొత్త ఏడాదిలో ప్రజలు అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని, తలపెట్టిన అన్ని పనుల్లో విజయం సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో పలువురు అధికారులు ఆమెను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో జిల్లా మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికార యంత్రాంగం అహర్నిశలు కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్, ఆర్డీవోలు ఎస్.సుధా సాగర్, జి.కేశవవర్ధన్‌రెడ్డి, డీపీఆర్‌ఓ లక్ష్మీనారాయణ, పీఆర్‌ఓ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో పురోగతి సాధించాలి : మంత్రి పినిపే విశ్వరూప్



భట్నవిల్లిలో మంత్రి విశ్వరూప్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

అమలాపురం రూరల్: కొత్త ఏడాదిలో రాష్ట్రం ఇప్పట్లాగే అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రజలు అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ ఆకాంక్షించారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు అధికారులు, ప్రజాప్రతినిధులతో ఘనంగా నిర్వహించారు. మంత్రి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. మంత్రి విశ్వరూప్, బేబీ దంపతులను పార్టీ కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, దంగేటి అచ్యుత జానకి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి, గెడ్డం సంపతిరావు, కొనుకు గౌతమి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, బద్రిబాబ్జి, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ ఏఓ కాశీ విశ్వేశ్వర రావు, ఆర్డీవోలు జి.కేశవవర్ధన్‌రెడ్డి, ఎం.ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతల పంపిణీ



కనకాలపేటలో రామ స్పర్శ అక్షతల ప్రదర్శన



శివకోడులో అక్షింతలు పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

యానాం: శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టువారి ఆదేశానుసారం సోమవారం పట్టణ పరిధిలో శ్రీరామ స్పర్శ అక్షతలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక లలితాదేవి ఆలయం వద్ద పడవలరేవు వీధి నుంచి ప్రారంభమై త్యాగరాజ వీధి, విష్ణాలయం వీధి, పైడికొండల వీధి, బెజవాడవారి వీధి, కనకాలపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ అక్షతలు పంపిణీ చేశారు. భక్తులు వారికిచ్చిన అక్షతలను పూజ గదిలో ఉంచుకుని ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ అయిన తర్వాత శిరసుపై వేసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తెలిపారు. అక్షతలతో పాటు ఆహ్వాన పత్రం, అయోధ్య రామాలయ చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలోని రాజోలు, శివకోడు, సోంపల్లి గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన బాల రాముని అక్షతల కలశాలతో శ్రీరాముని మంత్రం జపిస్తూ ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటికి అయోధ్య అక్షింతలను భక్తిశ్రద్ధలతో పంపిణీ చేశారు. అక్షతలతో పాటు శ్రీరాముని ఆలయ ఫొటో, ఈ నెల 22న అయోధ్యలో జరిగే రామ విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రాలు అందజేశారు.

అయినవిల్లి: మండలంలోని మాగాంలో అయోధ్య రామయ్య అక్షతలు బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వేటుకూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. జనవరి 1 నుంచి 15 వరకు గ్రామాల్లో ప్రతి ఇంటికి అక్షతలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు కొప్పనాతి శ్రీరామచంద్రమూర్తి, పసలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంచుకురిసే వేళలో...



అంబాజీపేటలో దట్టమైన మంచులో ప్రయాణిస్తున్న వాహన దారులు

మండలంలో శనివారం ఉదయం పది గంటలైనా మంచు వీడలేదు. వాహన చోదకులు దారి కనబడక ఇబ్బంది పడ్డారు. ప్రధాన రహదారుల్లో మంచు వల్ల దారి కనబడకపోవడంతో వాహనదారులు, సైక్లిస్టులు తడబాటు పడ్డారు. ప్రజలు మంచును తట్టుకోలేక ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. దట్టమైన మంచును సూర్యుడు చీల్చుకుని బయటకు వచ్చాడు. మంచుతో పాటు చలి కూడా విపరీతంగా ఉండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ప్రయాణికులు భయపడ్డారు. పగలు అధిక ఉష్ణోగ్రత, రాత్రి చలితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాగా మంచు కారణంగా మామిడి పూత పూయదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– అంబాజీపేట

అభ్యర్థి ఎవరైనా విజయానికి కృషి చేయాలి

యానాం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి నుంచి బీజేపీ తరఫున ఎవరిని అభ్యర్థిగా నిలిపినా వారి విజయానికి కృషి చేయాలని బీజేపీ ఇన్‌చార్జి నిర్మల్ కుమార్ సురేనా పేర్కొన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పుదుచ్చేరి బీజేపీ అధ్యక్షుడిగా కొత్తవారిని నియమించామన్నారు. అనంతరం పోలింగ్ బూత్‌స్థాయిలో పార్టీ నేతల విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో మంత్రి నమశ్శివాయం, శరవణ్‌కుమార్, అధ్యక్షుడు సెల్వగణపతి, ఎమ్మెల్యేలు శివశంకరన్, వీపీ రామలింగం, అశోక్ బాబు, వెంకటేషన్, రిచర్డ్, కల్యాణసుందరం పాల్గొన్నారు.

8న వెంకన్నకు లక్షతులసి పూజ

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే లక్షతులసి పూజ మహోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ లక్షతులసి పూజలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో స్వామికి పూజ నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ధనుర్మాసం సందర్భంగా స్వామిని పల్లకీలో ఊరేగిస్తూ గ్రామోత్సం నిర్వహించారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మామిడికుదురు: పాశర్లపూడి కొండాలమ్మ తల్లి ఆటో యూనియన్ సమావేశం సోమవారం పాశర్లపూడిలో జరిగింది. మండల ఆటో యూనియన్ కార్మిక సంఘం అధ్యక్షుడు తాడి రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుడుపూడి సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్‌గా బండారు చక్రి, కార్యదర్శిగా బొమ్మిడి రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా నాగళ్ల సత్తిబాబు, కోశాధికారిగా కోళ్ల తరుణ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఆటో యూనియన్ సహాయ కార్యదర్శి చింతపల్లి సతీష్, కడలి రామకృష్ణ, గొల్లమండల రవి, బళ్ల చిన్న, తాడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా భవానీల కలశ పూజ

అంబాజీపేట: మాచవరం దొమ్మేటి సత్యమోహన్, సత్యకుమారి దంపతుల ఇంటి వద్ద గురుభవానీలు దంగేటి సాయిబాబు, మాతా భవానీ మల్లేశ్వరి, మట్టపర్తి ఏసు గురుభవాని, మట్టపర్తి ప్రసాద్ గురు భవానీల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 54 కలశాల పూజను ఘనంగా నిర్వహించారు. గణపతి, చండీ హోమం, అమ్మవారికి కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. అంతకుముందు 54 కలశాలతో స్థానిక రామ్‌ఘాట్ కౌశిక నుంచి భవానీల శరణుఘోషతో జలాలను తీసుకువచ్చి సహస్ర నామాలతో అమ్మవారి కలశాలు, కుంకుమార్చన జరిపించారు. పూజ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన నిప్పులగుండంలో భవానీలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

బినామీల గుప్పిట్లో మున్సిపల్ షాపులు

- 135 షాపులకు నెలకు వచ్చే అద్దె రూ.1.80 లక్షలే
- ఏటా రూ.కోటి ఆదాయం కోల్పోతున్న యానాం మున్సిపాలిటీ



యానాం కొత్త బస్టాండ్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్



యానాం పాత బస్టాండ్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

యానాం: పట్టణం నడిబొడ్డున ఉన్న మున్సిపాలిటీ షాపులవి.. కాని ప్రతీ నెలా మున్సిపాలిటీకి వచ్చే అద్దె చూస్తే నామమాత్రంగా ఒక్కో షాపుకి రూ.900, రూ.1,000 మాత్రమే.. వాటిని అద్దెకు తీసుకున్న బినామీలు మాత్రం ఇతరులకు సబ్‌లీజులకి ఇచ్చి ఒక్కో షాపు నుంచి ప్రతీ నెలా రూ.10,000 నుంచి రూ.25,000 వరకూ అద్దె వసూలు చేస్తుండడం విశేషం.. అంతేకాదు వారి నుంచి ఒక్కో షాపుకి రూ.లక్షల్లో అడ్వాన్సులు తీసుకుని వడ్డీలకు తిప్పుకుంటున్నారు. బహిరంగ వేలం ద్వారా షాపులు కేటాయించాల్సి ఉన్నా మున్సిపాలిటీ ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

లక్షల్లో ఆదాయానికి గండి

యానాం పట్టణ పరిధిలో కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, సావిత్రినగర్, మార్కెట్ కాంప్లెక్స్, బాలయోగి కాలనీ, కనకాలపేట, గిరియాంపేట, ఇందిరా గాంధీ మార్కెట్ కాంప్లెక్స్, శివారు గ్రామాల్లోను కలిపి మున్సిపాలిటీ 135 షాపులను నిర్మించింది. అంతేకాదు మున్సిపాలిటీకి రెండు లాడ్జిలు సైతం ఉన్నాయి. అయితే ఆయా షాపులకు బహిరంగ వేలం పాట నిర్వహించకుండా రాజకీయంగా పలుకుబడి, సిఫార్సుల మేరకు కొందరు వ్యక్తులకు అప్పగించేశారు. దీంతో అత్యధిక శాతం షాపులు 15 ఏళ్లుగా బినామీల చేతుల్లోకి వెళ్లిపోయాయి. దీంతో వారంతా సంవత్సరాల తరబడి నెలకు రూ.వందల్లో అద్దె చెల్లిస్తూ ఆయా షాపుల్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. అవే షాపులను ఇతరులకు అద్దెకిచ్చి ప్రతీ నెలా రూ.వేలల్లో అద్దె రూపేణా పొందుతున్నారు. బినామీల దందా కారణంగా 135 షాపులకు కలిపి మున్సిపాలిటీకి నెలకు వచ్చే అద్దె సుమారు రూ.1.80 లక్షలే కావడం విశేషం. అంటే సరాసరిన ఒక్కో షాపు నుంచి నెలకు రూ.1,333 మాత్రమే ఆదాయంగా వస్తున్నట్లు లెక్క.. బినామీల కారణంగా ఏటా రూ.కోటికి పైగానే మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతుందని, వేలం నిర్వహిస్తే కనీసం పదింతల ఆదాయం వస్తుందన్న చర్చ మున్సిపాలిటీ వర్గాల్లోనే సాగుతుంది.

సిబ్బందికి వేతనాలివ్వొచ్చు

కేవలం రాజకీయ సిఫార్సులతోనే కట్టబెట్టేయడంతో ప్రస్తుతం షాపులను గుప్పిట్లో పెట్టుకున్నవారికి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అగ్రిమెంటు లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ దుకాణాలను అద్దెకు తీసుకున్నవారు వారే నిర్వహించుకోవాలి తప్ప మరొకరికి సబ్‌లీజుకి ఇవ్వడానికి లేదు. అయినా సుమారు 15 ఏళ్లుగా ఇదే తంతు నడుస్తుంది. ఇప్పటికీ ఆయా షాపులను తిరిగి స్వాధీనం చేసుకుని తీసుకుని బహిరంగ వేలం ద్వారా షాపులను కేటాయించడానికి మున్సిపాలిటీ ద్వారా అడుగులు పడడం లేదు. అసలే ఆదాయం లేక సిబ్బంది వేతనాలు సైతం ఇవ్వలేకపోతున్న మున్సిపాలిటీకి దుకాణాల్లో బినామీలను వెళ్లగొట్టగలిగితే భారీగా ఆదాయం సమకూరుతుంది. అందుకే ఇప్పటికైనా షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తే మున్సిపల్ సిబ్బంది వేతనాల వెతలైనా తీరతాయని కొందరు దిగువ స్థాయి సిబ్బంది కోరుతున్నారు.

లీజుదారులకు నోటీసులిచ్చాం



“మున్సిపాలిటీకి చెందిన షాపులను అద్దెకు తీసుకున్నవారు నిర్వహించకుండా ఏళ్ల తరబడి ఇతర వ్యక్తులకు సబ్‌లీజుకి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో షాపుదారులందరికీ గతంలోనే నోటీసులు ఇచ్చి సమాధానాలు చెప్పాలని ఆదేశించాం. వారి నుంచి బదులు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం.”

– అరుణ్ ప్రకాశం, మున్సిపల్ కమిషనర్, యానాం